

# పరిష్కారం

చెన్ను సుశీలారామం

"లలితా... ఐతే ఇక్కడ నీ వుద్యోగం మాని నా దగ్గరకు రావన్నమాట. సరే అదీచూస్తాను. ఎంతకాలం ఇలా వుంటావో.... వుండగలవో... నాకు పట్టుదల పెరిగాక వచ్చి ఎంత ఏడ్చినా. ఛస్తే నిన్ను ఏలుకోను. జాగ్రత్త.... మొగుడొదిలేసిందానిని పెళ్ళాట్టానికి

ఎవడూ ముందుకురాడు. ఆఖరి సారిగా ఆలోచించుకో...." భార్యని బెదిరించాడు మూర్తి.

"ఆఖరిసారి మొదటిసారి కూడా నాది ఒకటేమాట, ఒకటేచేత. మునుపటిలా బెదిరించి, భయపెట్టి బాధపెడితే పిరికిదానిలా పరుగెత్తు కొచ్చి నీ కాళ్ళదగ్గర పడివుండేది కాదు ఇప్పుడీ లలిత. ఎట్టి పరిస్థితి ల్లోను నా జీవనోపాధి ఒదులుకుని నీకు, నీ తల్లికి చెల్లెలికి సేవలు చేస్తూ నీ ఇంటిదగ్గర కుక్కలా పడి వుండను. మొగుడొదిలేసిన దానిని పెళ్ళాడ్డానికి ఎవరువచ్చినా రాక పోయినా ఇంక ఈసారి మాత్రం నా జీవితాన్ని ముళ్ళబాటలోకి మళ్ళించను. నీలాంటి పశువును గాక మనసున్న మంచిమగాడు దొరికినపుడే నా జీవితంలోకి ఆహ్వా నిస్తాను. ఇకపై నువ్వు నా ఇంటి గడప తొక్కవలసిన పనిలేదు. అవతల ఆఫీసుకు టైమవుతూంది నాకు. ఇంక నువ్వు బైటికి దయ చేయవచ్చు" నిష్కర్షగా చేత్తో బైటికి దారిచూపించింది లలిత.

శత్రువు చేతిలో ఘోరపరా జయం పొందినవాడిలా కుతకుత లాడిపోతూ.... భార్యని కళ్ళతోనే కాల్చేసేలా చూస్తూ పొగరుగా తలపైకెగరేస్తూ, విసురుగా అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయాడు మూర్తి. అప్పటివరకు బొమ్మలా నిలబడి చూస్తున్న పార్వతమ్మలో చలనం వచ్చింది.

"అమ్మా లలితా! ఏమిటి నువ్వు చేసినపని? చెట్టంత మగాడివి, కట్టు కున్నవాడిని, తాళికట్టినవాడిని, అంతలేసి మాటలని అవమానించి వెళ్ళగొడతావా? మహా పాపం చుట్టుకుంటుందే నీకు. ఎంతకాలం ఇలా మొగుడొదిలేసి వుంటావు? ఒంటరి ఆడదానికి ఈ సమాజంలో ఎలాంటి ఆదరణ దొరుకుతుందో నీకు తెలియదా? మూడుముళ్ళ బంధాన్ని తృటిలో తెంచేసుకోటం అంత తేలికైనదికాదు. పరుగెత్తి పాలుతాగే కంటే నిలబడి నీళ్ళు తాగడం వుత్తమం. నీ క్షేమం కోరేదాన్ని నీ తల్లిని చెబుతున్నాను విను. ఇప్పటికైనా మించిపోయింది లేదు....వెంటనే వెళ్ళి అతగాడికి కోపం ముదిరిపోకముందే క్షమా పణ చెప్పుకుని, కాళ్ళమీదపడి ఈ తప్పు కాయమని ప్రార్థించు... ఎప్పటికైనా నువ్వు అతని దగ్గరకే చేరాలి."

"అమ్మా! ఇంక ఆపు నీ హిత బోధలు. ఎందుకిలాంటి పలికి మాలిన నీతులు వల్లించి, నాకు పిరికిమందు పోస్తావు? ఇంతకాలం

నీమాటలు వినివిని ఎందుకూ పనికి రానిదానిలా కూపస్థమండూకంలా బ్రతికాను. ఇంక అలా బ్రతకడం నావల్ల కాదమ్మా! సాటి ఆడదానివై వుండి అతడ్ని ఎలా వెనకేసుకు రాగలుగుతున్నావు? మొన్నటివరకు రాక్షసుడు నన్ను పెట్టిన బాధలు అప్పుడే మర్చిపోయావా? ఔనులే! మొగుడు పగలు చావగొట్టినా, రాత్రి పక్కన జేరితే నోరు మెదపకుండా పడి వుండమనే తత్వం మీ కాలంనాటి, ఆడవాళ్ళ నరనరాల్లోనూ జీర్ణించుకు పోయింది. పిడికెడు మెతుకుల కొరకు మొగుడికి పనిమనిషిలా వంటమనిషిలా పడివుండటం ఇపుడు చెల్లదమ్మా. నేనూ చదువు కున్నాను. నా బ్రతుకు నేను బ్రతకగలను. ఎవరిదయా దాక్షిణ్యాల మీదా ఆధారపడిలేను నేను. చదువు సంధ్యలు చెప్పించక మూర్ఖంగా చిన్నతనాన్నే ఆడపిల్లకు పెళ్ళిచేసి పంపేసి, బాధ్యత వదిలించేసుకున్నా మనుకుంటున్నారు గాని, ఆడపిల్ల జీవితానికి ఎక్కడా విద్య ఎంత అవసరమో తెలుసుకోలేక వయసొచ్చినా బుద్ధిరాని మీ అజ్ఞానం మూర్ఖత్వం మూలంగానే, సీత జీవితం బలై పోయింది. కాని, చదువు సంధ్యలు లేనిదైనా తాను పోతూకూడా ఓ మంచిపని చేసి పోయింది. దానికి నేనెప్పటికీ గర్వపడుతూనే వుంటాను" కూతురి మాటలింకా పూర్తికాకుండానే, సీత ప్రసక్తి రావడంవల్ల, కళ్ళురెండూ నీళ్ళతో నిండగా అక్కడ్నుంచి లేచి లోనికెళ్ళిపోయింది పార్వతమ్మ.

అప్రయత్నంగానే లేచి యాంత్రికంగా టేబుల్ దగ్గరకు నడిచి ఫోటో ఫ్రేంలో బిగించి వున్న, సీత ఫోటో చేతుల్లోకి తీసుకుంది లలిత. ముద్దబంతి పువ్వులా ముగ్ధమనోహరంగా అమాయకమైన చిరునవ్వులు చిందిస్తూంది అద్దంవెనుక బొమ్మలా నిలిచిన సీత. ఏచెట్టుకి పూసిన పూవైనా అది విత్తయ్యి ఫలించి కలకాలం బతికేవి కొన్నిమాత్రమే. ఐతే, పూవు మొగ్గగావున్నపుడే కొందరు దుష్టులు నేలకూల్చి కాలరాయగా, మట్టిలో కలిసిపోయి శిధిలమై పోయేవి ఎన్నో - అలా మొగ్గగా వున్నపుడే మట్టిలో కలిసిపోయిన ముగ్ధసుందరమే సీత.

సీత, లలిత ఒకేవూళ్ళో ఒకే వీధిలో, పక్కపక్క ఇళ్ళల్లో పుట్టి పెరిగి, ఒకే కంచంలో తిని ఒకేమంచంలో పడుకుని తనువులు వేరైనా మనసులు ఒకటిగా పెన

వేసుకుపోయిన గాఢమైన ప్రాణ స్నేహం వాళ్ళది. సీతకి ఆరవ ఏటనే సీత తల్లి ఒక మగబిడ్డను కని మరణించింది. ఇంట్లో పనిపాటు చేసే దిక్కు, తమ్ముడ్ని చూసే దిక్కు లేక సీతని స్కూలుకు పంపలేదు తండ్రి. లలితలా చదువుకుంటానని సీత ఎంతపట్టుబట్టినా తండ్రి వినలేదు. పదహారేళ్ళ వయసులోనే పెళ్ళి ప్రయత్నాలు తలపెట్టాడామె తండ్రి. సీత అందచందాలు చూసి పైసా కట్నం అడక్కుండానే తన భార్యగా చేసుకున్నాడు రాజారాం. ఆ పిల్లకి కలిసొచ్చిన అదృష్టానికి దైవం పొంచివున్నాడని ఎవరూ వూహించలేకపోయారు.

ఆ రోజు స్నేహితురాల్ని చూడ్డానికి కొండంత ఆనందంతో బైల్దేరి వెళ్ళింది లలిత. రిక్షాదిగి లోని కెళ్ళబోతున్న ఆమె, తక్కున ఆగిపోయింది. "ఏయ్ సీతా! నీ బాబు దగ్గర్నుండి వుత్తరం వచ్చిందా!" బైటినుండి లోనికొస్తూ పెద్ద గొంతుతో అరిచాడు రాజారాం. వంటింట్లో కూరలు తరుగుతున్న సీత గతుక్కుమన్నది.

భర్త రాక గురించి భయం భయంగా చూస్తున్న ఆమెకు గుండెల్లో రాయి పడ్డట్లయింది. ఎక్కడివక్కడే వదిలేసి చేతులు పైటకొంగుకు తుడుచుకుంటూ కసాయివాడి ముందుకు వెళ్ళే మేక పిల్లలా బెదురుగా వెళ్ళింది. డ్రాయరు సొరుగులాగి ఇన్‌లాండ్ కవరొకటితీసి భర్త చేతికిచ్చి, దండశాసనుడయిన మాస్టారి ముందు పాఠాలురాని విద్యార్థిలా తల వాల్చి చేతులు నులుముకుంటూ నిలబడింది. కవరువిప్పి చదువుకున్న రాజారాం భార్య చెంప ఛెళ్ మనిపించి త్రినేత్రుడిలా కదం తొక్కడం మొదలెట్టాడు.

"ఛి ఛీ! వెధవ రకాలు. కూటికి గతిలేని ముష్టివెధవలు నిన్ను కూడా అక్కడే అడుక్కుతింటూ పడివుండనివ్వక నా మెడకెందుకు తగిలించాడు నీ బాబు? ఏదో ఎర్రగా బుర్రగా ఉన్నావు కదాని కానీ కట్నం అడక్కుండా నిన్ను కట్టుకున్నానే ఆమాత్రం ఇంగితం ఉండొద్దూ వయసురాగానే సరి గాదు. బుద్ధున్నవాడయితే ఇన్నిసార్లు అడిగించుకుంటాడా? ఏదీ మొన్న పండగనాటికి కొనివ్వమన్న స్కూటరు? పండగవెళ్ళి అప్పుడే మూడు నెలలైంది. నాతోపాటు పెళ్ళయిన నా ఫ్రెండ్సందరూ పండక్కి అత్తవారిళ్ళకెళ్ళి ఒకడు స్కూటర్ ఒకడు ఫ్రిజ్, ఒకడు గ్యాస్‌స్టౌ ఓహ్ ఎన్నో తెచ్చు

కున్నారు. వేలకట్నం వదలుకుని మా అమ్మ మాట వినకుండా విన్ని చేసుకున్నందుకు నాకు మంచి శాస్తే జరిగింది. ఓ అచ్చటా, ముచ్చటా ఏ్రాసి వెధవలు, శవివెధవలు"

చెంపదెబ్బ తిన్న సీత కళ్ళ ముందు రంగులరాట్నం గిర్రున తిరిగినట్లయింది. అది ఆమెకు కొత్తకాదు. పెళ్ళయి ఆరునెలలేవనా పండక్కి స్కూటరు కావాలంటూ మంకుపట్టు పట్టుకూర్చున్న రాజారాంకు చుక్కెదురై ఎవర్నేం చెయ్యాలో తెలియక ఆ అక్కసంతా భార్యమీద చూపించసాగాడు

పండగవెళ్ళి మూడు నెలలైనా రోజూ ఏదో ఒక వంకతో భార్యని తిట్టడం, కొట్టడం చేస్తున్నాడు. భార్య మాట్లాడకుండా ఉన్నా రెచ్చిపోతాడు. ఏదైనా సమాధానమిచ్చినా మరీ రెచ్చిపోతాడు.

"ఏం మాట్లాడవేమే దేభ్యమోహమా? నీబాబు అంత గతిలేని వాడని ముందే ఏడవకపోయావా? రాజాలా మంచి సంబంధం చేసుకునేవాడ్నికదా! అప్పరాల్ ఒక్క స్కూటర్ కొనివ్వలేడా ఆ రాస్కెల్? ఇల్లు తాకట్టుపెట్టి కొడుకుని చదివించడానికైతే ప్రాణంఒప్పిందిగాని, పైసాకట్నం తీసుకోని బంగారంలాంటి అల్లుడు అడక్క అడక్క ముచ్చటగా ఓ స్కూటరు కావాలని నోరు తెరిచి అడిగితే కొనివ్వలేడా? కొడుకుని గొప్ప చదువులు చదివిస్తే తనను ఉద్ధరిస్తాడనుకుంటున్నాడు గాబోలు ఏం వాడు చదివిందిచాలదా? ఏ కొట్లోనో గుమాస్తాగా పడెయ్యకూడదా? రాస్కెల్ నన్నేమనుకుంటున్నాడో, నీఅంతు నీ బాబు అంతు చూస్తేగాని వదలను. ఇంకా ఇక్కడే ఏడుస్తావేం? వెళ్ళి కాఫీ పట్టుకుని తగలడు."

పైటచెంగుతో కళ్ళు తుడుచుకుంటూ వంటగదిలోకెళ్ళి, కాఫీ కలిపి తీసుకొచ్చింది. అది త్రాగి బలం పుంజుకొని యుద్ధానికి సిద్ధమయిన సైనికుడిలా మళ్ళీ దండకం మొదలెట్టాడు.

"ఏయ్ మొద్దూ ఏమిటి నీ ఉద్దేశం? నీ తండ్రి పుండాకోరు ఎప్పటికయినా ఆ స్కూటర్ కొనిస్తాడంటావా? అంత కొనివ్వలేని ముష్టివెధవ అడుక్కుతినే అంట్ల వెధవ అప్పుడు నేను అడిగినప్పుడు బుర్ర ఎందుకు ఊపాడు? తల ఊపడమేగాని కొనివ్వడానికి చేతులు రావడంలేదా నీబాబు దగుల్బాజీగాడికి?" భర్త మాటలకు సహనం చచ్చిపోతూంది సీతలో.

తండ్రిని అంతలేసి మాటలు అంటూండటంతో ఆమె అభిమానం దెబ్బతిన్నది. ఏం జరిగితే అదే జరుగుతుందని భర్తను ఎదిరించడానికే నిశ్చయించుకొని నోరు విప్పింది.

"ఇంక ఆపండి మీ మాటలు. మా నాన్న ముష్టివెధవ, అడుక్కుతినే వెధవ ఎలాగవుతారు? మీ లాగా స్కూటర్ కావాలని ఎవర్నీ ముష్టి అడిగి దేబిరించడంలేదు. కట్నం తీసుకోలేదని మీకై మీరు వందసార్లు ఎందుకు డబ్బా కొట్టుకుంటారు? అంతకుమించిందే కావాలని సాధిస్తున్నారుగా! పశ్శాడగొట్టడానికి ఏ రాయైనా ఒక్కటే. మా నాన్న మంచి స్తోమతు గలిగివుంటే, మీలాంటి గుమాస్తాగిరికిచ్చి ఎందుకు కట్టబెడతాడు నన్ను? పెద్ద ఆఫీసరుకే ఇచ్చి చేసి ఉండును.

పైసా కట్నం అక్కర్లేదని పదిమంది పెద్దలముందూ డంబాలు పలికి, అందరిచేతా పొగిడించుకొని ఆకాశానికెత్తించుకొని, ఇప్పుడు స్కూటరు కావాలని సాధింపు మొదలెడతారా? ఏదైనా అంగవైకల్యముండి అడుక్కునే వాళ్ళంటే మా నాన్న జాలిపడతాడుగాని మీలాగా దుక్కలావున్న ముష్టివాళ్ళంటే మా నాన్నకి పరమ అసహ్యం మరెప్పుడూ ఈ విషయమై మా నాన్నకి ఉత్తరాలు వ్రాయద్దు" చెప్పు తీసుకొని పెడీమంటూ చెంపమీద కొట్టినట్లుగా పేడపిడకు ముఖాన కొట్టినట్లుగా, సమాధానం చెప్పి అక్కడ్నుండి లోపలికి వెళ్ళిపోయింది సీత.

నిశ్చేష్టుడయి పక్షవాతం వచ్చినవాడిలా నోట మాటరాక, కదులు మెదులులేక నిలబడిపోయాడు రాజారాం. అటు సూర్యుడిటు ఉదయించినా, పగటిపూట ఆకాశంలో చంద్రుడు చుక్కలు పొడిచినా తేలికగా నమ్మేవాడేమోగాని, తన పల్లెటూరి భార్య మూడు నెలలుగా సాధిస్తూ చావగొడుతున్నా నోరు మెదపని మహాపతివ్రత, మహాసాధ్వి ఈ రోజిలా ఎదురుతిరిగి ఇంత ఘాటుగా సమాధానం చెప్పడంతో గుక్క తిప్పుకోలేక పోయాడా మానవుడు.

ఇదిలా వదిలేస్తే చాలా ప్రమాదం ముంచుకొచ్చేట్లుందని అది తన మగతనానికే నామర్దాయని, చేతుల్లోను, కాళ్ళల్లోను శక్తివున్నంతవరకు గొడ్డును బాదినట్లు బాది రొప్పుతూ వీధినబడి ఎటోపోయాడు. గుమ్మం బయట ఓపక్కగా నిలబడున్న లలిత

కొయ్యబారిపోయింది. తన తండ్రికి విషయం తెలియనీయవద్దని లలిత దగ్గర ప్రమాణం చేయించుకొని ఆమె నోరు నొక్కేసింది సీత. ఆ తర్వాత ఎన్నోసార్లు భర్తతో చావు దెబ్బలు తిని పుట్టింటి కొచ్చినా, భర్త ఏమన్నా ఏంచేసినా సర్దుకుపోతూ అతనిదగ్గరే ఉండాలని, పౌరుషంగా పుట్టింటికి రాకూడదని, పుట్టింటికి చుట్టంచూపుగా రావడమేగాని ఎక్కువకాలం ఉండిపోవడం మర్యాదకాదని తండ్రి నచ్చజెప్పి పంపేశాడు.

ఒకనాడు అర్జంట్‌గా బయల్దేరి రమ్మని టెలిగ్రాం అందగానే సీత తండ్రి రాఘవరావు తల్లి వారిస్తున్నా వినకుండా లలితకూడా బయల్దేరి వెళ్ళారు. హాస్పిటల్లో ఒళ్ళు కాలిపోయి బొబ్బలెక్కి భయంకరంగా ఉంది సీత. తల పగిలి రక్తపుమడుగులో చచ్చి పడున్నాడు రాజారాం. యమబాధ బాధపడుతూనే, చావు తెలివిలో ఉన్నదానిలా ఆవేశంగా మాట్లాడేస్తుంది సీత. సీత మాట్లాడుతున్న దంతా జాగ్రత్తగా వ్రాసుకుంటు కొంటున్నారు పోలీసాఫీసర్లు.

"ఔను నా భర్తఅని చెప్పుకోడానికే సిగ్గుపడుతూన్న ఆ దుర్మార్గుడే నా భర్త. వాడి గొంతెమ్మ కోరిక మా నాన్న తీర్చలేకపోయాడని, ఆ పగ నా మీద సాధించదలుచుకుని రోజూ నన్ను కొద్దికొద్దిగా చంపుకు తింటున్నాడు. ఆఖరికి వాడి ఆకలి చల్లారక ఒక్కసారే చంపి నా పీడ వదిలించుకోవాలని ఈరోజు ఇంటికొస్తూనే నాతో ప్రేమగా వున్నట్లు నటిస్తూ పెరట్లోకి తీసుకెళ్ళి నోట్లో గుడ్డలు క్రుక్కి నా ఒంటిమీద కిరోసిన్ పోసి నిప్పు పెట్టాడు. మేమున్న ఇల్లు ఊరికి దూరంకావటంవలన చుట్టుపక్కల పిలిస్తే పలికే దిక్కులేక, నాకు సాయపడేవాళ్ళు లేకపోయారు. ఇంక నాకు చావు తప్పదని తెల్సు. ఆఖరిగా ఓ మంచిపని చేయాలని నిశ్చయించుకొని వాడిమీద ఉన్న పగే నాకు కొండంత బలానివ్వగా అక్కడే ఉన్న గొడ్డలితో నా బలాన్నంతా ఉపయోగించి వాడి తల మీద ఒక్క వేటు వేశాను. ఇది ఊహించనివాడు నా దెబ్బకు కాచుకోలేకపోయాడు.

ఏం- అలా చూస్తున్నారు? పవిత్రమైన ఈ భారతదేశంలో పతివ్రతగా ఉండాల్సిన భార్య, కట్టుకున్నవాడినే కొట్టి చంపేటంత దుమ్ముఉన్నదా అని ఆశ్చర్యపోతున్నారా? లేక ఇలాంటి

దుర్మార్గాని కొడిగట్టిందేమిటని అసహ్యించుకొంటున్నారా? మీరు ఎలాగనుకున్నాసరే నేను బ్రతికి బట్టకడితే నాకెలాంటి శిక్ష విధించినా సరే, నేను చేసిన పని మహా పవిత్రమైనదని నాకు తెలుసు. నా అంతరాత్మకు తెలుసు. భూదేవికి భారమైన ఇలాంటి దుర్మార్గులు బ్రతకకూడదు. బ్రతికి మరో ఆడపిల్ల బ్రతుకు బండలు చెయ్యకూడదనే ఇలాంటి పని చేశాను. పిల్లి పిల్లయినాసరే గదిలో పెట్టి బంధించి బాధిస్తుంటే అది ఎదురు తిరిగి అవతలవాళ్ళను హత మారుస్తుంది.

ఆ దుర్మార్గుడికి ఆ శిక్ష చాలదు చిత్రహింసలుపెట్టి మరీ చంపాలి. అది నావల్లకాదు. వాడు నన్ను మానసికంగా, శారీరకంగా పెట్టిన హింసకు ఏ న్యాయస్థానం, ఏ న్యాయమూర్తులతోనూ పని లేకుండా వాడికి తగినశిక్ష నేనే వేశాను. ఇప్పుడు నాకెంతో ఆనందంగా ఉంది. చట్టాన్ని నా చేతుల్లోకి తీసుకుంటే ఒప్పుకోరు గాని భార్యల్ని చిత్రహింసలు పెట్టి చంపిన భర్తలకు ఉరిశిక్షో, కొంత కాలం జైలుశిక్షో విధిస్తుంది న్యాయస్థానం. అలాగైతే ఒక్కసారే ప్రాణాలు పోతే వాళ్ళకు చావులో భయం బ్రతుకుమీద తీపి తెలిసిరావు. వాళ్ళు ఎలాంటి దారుణానికి ఒడికట్టి అవతల వ్యక్తి విందు ప్రాణాలు తీశారో ఆ విధమైన శిక్షే వీళ్ళకూ విధించి ప్రాణాలు తీయాలి.

నాన్నా! ఏడుస్తున్నావా? ఇప్పుడెందుకు నాన్నా ఏడవడం? నన్ను చదివించు నాన్నా అని చిన్నతనంలో ఏడిస్తే నన్ను రెండు చీవాట్లుపెట్టి నామాట కొట్టిపారేశావు. నీ అల్లుడు నన్ను తిట్టి కొట్టి బాధిస్తుంటే అది నీకుతెలిస్తే కృంగిపోతావని, అదంతా దాచిపెట్టి, ఎన్నోసార్లు నీదగ్గరకొచ్చేసి కొంత కాలం నీదగ్గర వుండనివ్వమంటే పెళ్ళైన ఆడది ఎక్కువ రోజులు పుట్టింట్లో వుండకూడదు. భార్యాభర్తలమధ్య ఏమైనా పొరపొచ్చాలొస్తే భార్యే సర్దుకుపోవాలని, నన్ను పంపించేసేవాడివి. నేనే గనుక చదువుకునుంటే నా బ్రతుకు నేను బ్రతికేదాన్ని. వాడిదగ్గర అంతకాలం అన్నిబాధలు పడుతూ వుండేదాన్ని కాదు.

లల్లీ! నా గురించి బాధపడకే! నువ్వైనా బాగా చదువుకుని, మంచివాడు దొరికితేనే పెళ్ళిచేసుకో. ఏపరిస్థితుల్లోనూ మధ్యలో చదువు మానకు. నాన్నని, తమ్ముడ్ని

చూస్తుండు. నన్ను ఎప్పుడూ మర్చిపోవుకదూ" రొప్పుడూ మాట్లాడుతున్న సీత ఆయాసం పెరిగిపోగా మరి మాట్లాడలేకపోయింది. చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ నాలుగు రోజులకు ఈ లోకాన్ని విడిచిపోయింది సీత.

స్నేహితురాలి జ్ఞాపకాలతో మనసంతా బరువెక్కిపోయింది లలితకు. వడివడిగా లోనికెళ్ళి తల్లిని తీసుకొచ్చి కుర్చీలోబెట్టి సీతఫోటో ఆమె చేతికిచ్చింది "చూడమ్మా సీతనుచూడు. దాని బ్రతుకులా నా బ్రతుకూ సర్వనాశనం కావాలనుందా నీకు? చెప్పు. అదే నీ కోరికైతే ఇప్పుడే నీ అల్లుడి దగ్గర కెళ్ళిపోతాను. ఇంతవరకూ నీ కూతురు మొగుడ్నొదిలేసి వచ్చి బరితెగించి మగరాయుడిలా ఆఫీసులంటూ తిరిగి వుద్యోగం వెలగబెడుతుందని, నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకుంటున్నారని, తెగబాధపడిపోతున్నావు. నేను వుద్యోగం చెయ్యటం మన ఇంటా వంటా లేదని, మన పరువు ప్రతిష్టలకు నేనే దోముప్పుతెస్తున్నానని, నువ్వు రోజూ ఎవరిమీదనో ఒంకలు పెడుతూ అంటున్న మాటలు నేను అర్థంవేసుకోలేదనుకోకు. పెద్దదానివి నీమనసు కష్టపెట్టడం ఎందుకని ఇంతకాలం మాట్లాడకుండా వూరుకున్నాను. ఇప్పుడుచెప్పమ్మా ఆత్మాభిమానం చంపుకుని ఆ యమకూపంలోకెళ్ళి యముడిలాంటి భర్త యమభటులకు మించివున్న అత్త అడబడుచులు పెట్టే ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తూ కొంతకాలానికి వాళ్ళే నన్ను హత్యచేసినా, లేక నేనే బాధలకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నా నీకు సమ్మతమేనా? నీ ప్రాణం కుదుటబడుతుందా" కూతురి మాటలింక వినలేక, గబుక్కున పైకిలేచి కూతుర్ని కౌగలించుకుంది పార్వతమ్మ.

"అమ్మా లలితా! ఎంతమాటన్నావమ్మా ఏ తల్లీ కూతురిచేత ఇలాంటి మాటలు పడదు. ఏ తల్లీ కూతుర్ని అంత ఘోరంగా శిక్షించుకోదు. నలుగురూ అనుకునే మాటలు వినీ వినీ, మనవంశ గౌరవం, పరువు ప్రతిష్ట పోతున్నాయని గుడ్డిగా నమ్మి, నిన్ను ఏదేదో అన్నాను. చిన్నదానివైనా నా మూర్ఖత్వాన్ని వదిలించి నాకళ్ళు తెరిపించావు. నన్ను మన్నించు తల్లీ! నీ సమస్యలకు నువ్వు తీసుకున్న నిర్ణయమే సరైన పరిష్కారం."

తల్లి మాటలతో సంతృప్తిగా నిట్టూర్చింది లలిత. ●